క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిద్దాం



నారాయణపేట రూరల్: ప్రతి గ్రామంలో ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటు చేసిందని, ప్రతి ఒక్కరూ స్థానికంగా ఉన్న బడిలోనే తమ పిల్లలను చేర్పాలని డీఎస్‌ఓ భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని జాజాపూర్, నిడుగుర్తి, అప్పక్‌పల్లి గ్రామాల్లో బడి బాట కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. అక్కడ బడి పూర్తి చేసుకున్న విద్యార్థులను హైస్కూల్‌కు రావాలని ఆహ్వానించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేస్తున్నారని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామని, నిష్ణాతులైన టీచర్లతో బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం సత్యనారాయణ, మాధవి, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టపగలే వెన్నెల



మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. మండలంలోని వడ్వాట్, వర్కూర్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో 24 గంటల పాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఆత్మకూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఆర్భాటంగా జరుపుకొంటున్న ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ప్రసాద్, జిల్లా నాయకుడు రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా కోటి ఉద్యోగాలు భర్తీ కాలేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులైజేషన్ జరుగలేదని, డబుల్ బెడ్రూంఇళ్ల ఊసే లేదని, రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, నిరుద్యోగ భృతి లేదని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని ఆరోపించారు. ధరణి వెబ్‌సైట్ అవకతవకలను సరి చేయాలని, పంటల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సింధూజకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, బాలస్వామి, వెంకటేష్, రాములు, లక్ష్మణ్, వెంకటమ్మ, శిరీష, సుజాత తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



దామరగిద్ద: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సజనాపూర్ గ్రామంలో సురక్ష పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో రక్షణ చట్టాలు, రోడ్డు, శాంతి భద్రతలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సెల్‌ఫోన్ వినియోగంలో అనర్థాలు, రోడ్డు భద్రత, మూఢనమ్మకాలు ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, బ్యాంక్ లోన్ పేరుతో వచ్చే అపరిచిత ఫోన్‌కాల్స్‌లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనుమానిత వ్యక్తులు లేదా ఘటనలు చోటుచేసుకున్న 100 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంజమ్మ, కళాజాత బృందం సభ్యులు, కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న కళ్యాణి, రుక్యానాయక్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థలో అడవి సత్యవార్ వంతెన
- రక్షణ గోడలు లేక ప్రయాణికుల అవస్థలు

మాగనూర్: మండల పరిధిలోని వాడ్వట్ – అడవిసత్యవార్ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై కొన్నేళ్ల కిందట వంతెనను నిర్మించారు. ఎనిమిది గ్రామాల ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడటంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతేడాది వరదల కారణంగా రక్షణగోడలు కొట్టుకుపోయాయి. వంతెన పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ వంతెనకు ఎగువన వర్షం కురిస్తే వరద తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అడవిసత్యవార్, మందిపల్లి, కోల్పూర్, గజగజరందొడ్డి, పూంజనూర్, మూడుమాల్, వాడ్వట్, అమ్మపల్లి గ్రామాల ప్రజలు జంకుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వంతెన

చిన్నపాటి వర్షాలకే రాకపోకలు బంద్..

వాడ్వట్ అడవిసత్యావార్ గ్రామాల మధ్య పెద్దవాగుపై గల వంతెన చిన్నపాటి వర్షాలకే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా ఎగువన ఉన్న సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీరు దిగువకు వదిలితే వంతెనపై నుంచి వరద నీరు ప్రమాదకరగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. వరద వస్తే ఇంటికే పరిమితం కావాల్సిన దుస్థితి నెలకొంది. ఆయా గ్రామాల నుంచి ఉపాధి పనులకు వెళ్లే కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ వంతెన నిర్మించాలి



వడ్వాట్–అడవిసత్యరం గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం వంతెనపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాగుపై ఉన్న గుంతలు రాత్రి వేళ కనిపంచడం లేదు. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి. – నర్సింహులు, అమ్మపల్లి

ప్రతిపాదనలు పంపిస్తాం



అడవిసత్యవార్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది వాస్తవమే. ఇదివరకే వంతెనను పరిశీలించాం. ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం. నూతనంగా బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – విలోక్, ఏఈ పంచాయతీ రాజ్ మాగనూర్

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: పార్టీలకు అతీతంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కోస్గి, గుండుమాల్ మండలాలకు సంబంధించిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తోపాటు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. దళిత బంధు, కుల వృత్తుల వారికి రూ.లక్ష అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష, ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, గ్రంథాలయ జిల్లా చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, నాయకులు మ్యాకల రాజేష్, వెంకట్ నర్సిములు, రాస్నం బాల్‌రాజ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట



ఊట్కూరులో బడిబాటలో పాల్గొన్న ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి

ఊట్కూరు: మండల కేంద్రంతో పాటు లక్ష్మీపల్లి, నిడుగుర్తి, ఓబులాపూర్, మల్లెపల్లి గ్రామాలలో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాలలో ఐదుగురు, లక్ష్మీపల్లి పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు బడిలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, శ్రీవిద్య, సునంద, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు సంబరాలు నిర్వహించే అర్హత లేదు

నారాయణపేట రూరల్: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా ప్రభుత్వం సంబరాలు నిర్వహించే అర్హత లేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు యాదగిరి విమర్శించారు. గురువారం దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోటకొండలో పర్యటించి కరపత్రాలు పంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీకి బలం పెంచుకోవడం కోసం అధికారిక సభల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా వ్యతిరేకంగా మారారని అన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, ఇస్మాయిల్, రాఘవేందర్, రమేష్, భీంషప్ప, రాంచందర్, సాయిలు, మాణిక్యప్ప, దస్తప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

బీసీల విభజనకు ప్రభుత్వం కుట్ర

కోస్గి: బీసీలను విభజించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల పేరుతో బీసీలను విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు నామమాత్రంగా ఆర్థిక సాయం చేసి సమస్యలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న బీసీ బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న నియోజకవర్గ కేంద్రంలో వివిధ మోర్చాల సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నర్సిములు, కో కన్వీనర్ రాము, పార్టీ మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, నాయకులు శ్రీకాంత్, వెంకటయ్య, సతీష్, రమేష్, నరేష్, యాదయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

మండల సాధన దీక్షలో పూర్వ విద్యార్థులు



దీక్ష శిబిరంలో కూర్చన్న పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్షలు 31వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా.. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. స్థానిక నాయకులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే చొరవ తీసుకుని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, యాదగిరి, హాజి, వెంకట్రాములు, సౌజన్య, నర్సింహులు, రామకృష్ణ, సలీం, దస్తప్ప, రామచంద్ర, రవి, కనకప్ప, ప్రతాప్ పాల్గొన్నారు.

హామీ మేరకు మద్దతు ధరలు ప్రకటించాలి

నారాయణపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పంటకు మద్దతు ధర ప్రకటించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐపీకేఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరం వానాకాలం సీజన్‌కు సంబంధించిన కనీస మద్దతు ముందే ప్రకటిస్తున్నట్లుగా, ఇంత వరకు ఏ ప్రభుత్వం పెంచలేనట్లుగా పెంచుతున్నామని కేంద్ర ప్రభుత్వ ఆహార శాఖ మంత్రి పియూష్‌గోయల్ చెప్పడం సరికాదన్నారు. దేశ వ్యాప్తంగా పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కానీ దానికి భిన్నంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. బీజేపీ ఇచ్చిన వాగ్దానాల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించకపోతే మరో ఢిల్లీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, నారాయణ, రాములు, ప్రశాంత్, వెంకట్రాములు, హాజిమలాంగ్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐపీకేఎస్ నాయకులు

సబ్బండవర్గాల అభ్యున్నతే ధ్యేయం



చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: సబ్బండవర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నారాయణపేట జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఓ కన్వెన్షన్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురువ యాదవులకు గొర్రెలు, కులవృత్తులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కులాంతర వివాహాలు చేసుకున్న లబ్ధిదారులకు వారు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కులవృత్తులకు ప్రతి ఒక్కరికి రూ.లక్ష అందిస్తుందన్నారు. అభివృద్ధిలో అందరు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, జెడ్పీటీసీలు అశోక్‌గౌడ్, వెంకటయ్య, ఎంపీపీలు వనజ, శ్యామలమ్మ, ఎల్కోటి లక్ష్మి, పూర్ణిమ పటేల్, జెడ్పీ సీఈఓ జ్యోతి, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావనీ, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు గడ్డం రమేష్, దత్తు, శివప్ప, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అనుగొండలో ఎస్సీ కాలనీలో 35 మంది లబ్ధిదారులకు వారు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, సర్పంచ్ గడ్డం రమేష్, ఎంపీటీసీ పద్మ, రాములు పాల్గొన్నారు.

గొల్లకురుమల సంక్షేమానికి కృషి

నర్వ: ప్రభుత్వం గొల్లకురుమల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రాష్ట్ర సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని కుల వృత్తులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సర్పంచ్ శివన్న, ఉప సర్పంచ్ నాగరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మన్న కుంటను కాపాడాలని ఆందోళన

మరికల్: ఎమ్మెల్యే అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలోని ధర్మన్న కుంటను కబ్జా చేసుకుంటున్నారని బీఎస్పీ ఇన్‌చార్జీ శ్రీనివాస్ ఆరోపించారు. కొన్ని రోజుల నుంచి రాత్రి సమయంలో టిప్పర్ల సహాయంతో ధర్మన్న కుంటను మట్టితో పూడ్చి వేస్తుండటంతో వారు శుక్రవారం ఇందిరాగాంధీ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలపై మత్స్యకారులకు ఉన్న హక్కులను కాలరాస్తూ బీఆర్‌ఎస్ నాయకులు వాటిని ఆక్రమించుకుంటున్నారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారుల అండతో చెరువులను, కుంటలను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నా ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు చెరువులకు నాలా అనుమతులు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. ధర్మన్న కుంటను బీఆర్‌ఎస్ నాయకుల చేర నుంచి కాపాడాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, వెంకటయ్య, మత్స్యకార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, శేఖర్, మొగులప్ప, అశోక్, వెంకట్రాములు, తిమ్మరాజులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ముదిరాజ్‌లకు రూ.లక్ష ఆర్థికసాయం అందించాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వాళ్లకు మాత్రమే రూ.లక్ష ఆర్థికసాయం చేస్తామని చెప్పడం హాస్యాస్పందంగా ఉందని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు సత్యన్న, రామకృష్ణ, మొగులప్ప అన్నారు. మరికల్‌లో శుక్రవారం వారు ప్రభుత్వ తీరుకు నిరసన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓట్లకు నోట్ల రాజకీయం చేస్తూ కులాల మధ్య చిచ్చు రగిలిస్తుందన్నారు. కుల వృత్తులు ఉన్నవారికి మాత్రమే ఆర్థికసాయం చేస్తామనడం సబబు కాదన్నారు. ప్రభుత్వం ఎంపిక చేయని కులాల్లో ఆర్థిక స్తోమత లేక చిరు వ్యాపారాలు, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి రుణ ఆర్థికసాయం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విభజించు పాలించు అనే పద్ధతిలో పాలన సాగించడం వల్ల అనేక కులాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక మరుగున పడ్డాయన్నారు. ప్రభుత్వం అందజేసే రుణం ముదిరాజ్‌లతో పాటు ఎంపిక కాని ఇతర కులాలకు కూడా వర్తింప జేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో శేఖర్, ఆంజనేయులు, రమేష్, రాము పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

మద్దూరు: మండల కేంద్రానికి చెందిన తాజోద్దీన్ హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం జామ మసీద్, అల్ జుబేదా మసీద్ కమిటీల సభ్యులు శుక్రవారం ఆయన సన్మానించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన శంకరప్ప కుటుంబ సభ్యులు ఆయన నివాసంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హజ్ కమిటీ సభ్యులు రహీం, మసీద్‌ల కమిటీ సభ్యులు షేక్ అహ్మద్, ఫీర్‌అహ్మద్, అబ్దుల్ ఖయ్యూం, హబీబ్, చాంద్‌పాషా, పింజరి హుసేన్, జైనోద్దీన్, ఇక్బాల్, షబ్బీర్, చికిని అంజయ్య, షఫీ, నూర్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్రికుడిని సన్మానిస్తున్న శంకరయ్య

అనుమతి లేని పాఠశాలల్లో చేర్పించొద్దు



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్

మక్తల్: అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థి యువజన, ప్రజా ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేసి దోపిడీ చేస్తున్నారన్నారు. పట్టణంలో శ్రీ చైతన్య పేరుతో ఒక బోగస్ పాఠశాల అడ్మిషన్లు ప్రారంభించిందని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యాశాఖ అధికారులు అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు మద్దిలేటి, హైమావతి, వెంకటస్వామి, భగవంతు, అజయ్, కల్యాణం రాజు, శేఖర్, రమేష్, నాగేష్, పృథ్వీరాజ్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే మెరుగైన విద్య

నారాయణపేట రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని అధ్యాపకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని జీజేసీ కళాశాల బోధన సిబ్బంది శుక్రవారం మండలంలోని తిర్మలాపూర్‌లో కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్ పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ఎలాంటి ఫీజు లేకుండా చక్కటి విద్య ప్రభుత్వ కాలేజీల్లో దొరుకుతుందని, ప్రైవేటు దోపిడి నుంచి తప్పించుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి తల్లిదండ్రులను వదిలి ఉండటం కష్టమని, స్థానికంగా ఉంటూ చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, శోభ, అరుణ, రాజు, శ్రవణ్ పాల్గొన్నారు.



తిర్మలాపూర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నేతన్నకు 'చేనేతబంధు' అందజేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పద్మశాలీలు

ధన్వాడ: పద్మశాలీలకు చేనేతబంధు అందజేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చేనేత సహకర సంఘం అధ్యక్షుడు మాకం సత్యనారాయణ, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బాల్‌రాజు మాట్లాడుతూ కుల వృత్తుల కోసం ప్రభుత్వం రూ.లక్ష సాయం అందించే జీఓలో పద్మశాలీలను తొలగించడం సరికాదన్నారు. ఆర్థికంగా వెనకబడిన పద్మశాలీలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. చాలా మంది పద్మశాలీలు వెళితే బొగ్గు బావి లేదంటే బొంబాయి అన్న చందంగా సుమారు 3 లక్షల చేనేత కుటుంబాలు బొంబాయి, సూరత్, భీమాండి, షోలాపూర్, అహ్మదాబాద్ వంటి ప్రాంతాలకు పొట్టకూటి కోసం వలస వెళ్తున్నారన్నారు.

సహకారం సంఘాలు నిర్వీర్యం

రాష్ట్రం ఆవిర్భావ సమయంలో సుమారు 260 చేనేత సహకార సంఘాలు ఉండగా.. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించని కారణంగా పాలక వర్గాలు లేక అధికారుల నేతృత్వంలో అవి పూర్తిగా కుంటుపడ్డాయని వాపోయారు. సుమారు 20 లక్షల పద్మశాలీల జనాభాలో చేనేత కార్మికుల కేవలం 5శాతం మాత్రమే అర్హులైన మిగతా 95శాతం పద్మశాలీలకు ఎలాంటి ప్రభుత్వ సాయం అందడం లేదన్నారు. చేనేత బంధు పథకం ప్రకటించి రూ.10 లక్షల ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గోవింద్, విష్ణు, విజయ్‌కుమార్, భాస్కర్, జయప్రకాష్, వెంకట్రాములు, నాగార్జున, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.